# ఆశల చీకటి

వి. రాజారామమోహనరావు

"పెద్ద వర్షం కాకపోయినా గాలికి జల్లు ఎక్కువయింది. కిటికీ దగ్గరగా వున్న కుర్చీని కొంచెం వెనక్కి లాక్కుంది సునంద. ఈ రాత్రి యీ చీకటి నా సొంతం అన్నట్టు చీకటితో కలిసిపోతూ కురుస్తోంది వర్షం.

"ఇంకా రాలేదేం" అనుకుంది చేతికున్న వాచీ చూసుకుంటూ సునంద. టైము పది దాటింది. ఎదురుగా డ్రస్సింగ్ టేబిల్ అద్దంలో కనిపిస్తున్న తన ప్రతిబింబాన్ని చూసి—

"అసలు నేనేనా " అనుకుంది.

అద్దంలో తనని తను చూసుకోటం తప్పని సరయిన బ్రతుకు. వేళ్ళగోళ్ళ దగ్గర్నుంచి, కత్తిరించిన కనుబొమ్మలవరకూ రంగులు పూసుకోవాలి. తీర్చి దిద్దుకోవాలి. క్రీములు, పౌడర్లు యిలా మేకప్, ముసుగే జీవితమై పోయింది.

పల్లెటూరు నుంచి నాలుగు మైళ్ళు నడచి రోజూ టౌనుకెళ్ళి హైస్కూల్లో చదివిన నాటి రూపం మగపిల్లలు ఎదేనా అంటే ఖస్సుమని లేచే ఆనాటి పొగరు గుర్తొచ్చినప్పుడు మరీ చిత్రంగా వుంటుంది సునందకి. జీవితం మనుషుల్ని వింతగా మార్చేస్తుంది అనిపిస్తుంది.

ఇంకోసారి టైము చూసుకుంది సునంద. పదిన్నర దగ్గర పడుతోంది. కొన్నాళ్ళక్రితం వరకూ యిలా ఎవరేనా వస్తారన్నా తను ఎక్కడికేనా వెళ్ళాలన్నా చాలా ఆతృతగా వుండేది. చాలా ఆశగా వుండేది. ఏరోజు కారోజే ఏ క్షణానికి ఆ క్షణమే తన భవిష్యత్తు తారాపథానికి జేరిపోతుందనిపించేది. ఆతృతకి వొళ్ళంతా సెగలొచ్చి బుగ్గలన్నీ ఎరుపెక్కి, శ్వాస తీవ్రమై తన కళ్ళు తన మనసు తనకే అర్థం కానట్టుండేది.

ఇప్పుడు ఇంచుమించు అలవాటయిపోయి నట్టే. ఇదివరకటి స్వచ్ఛంగా ఆశగా కనపడే లోకం యిప్పుడు చిత్రమైన రంగుల్లో రంగు రంగుల కన్నీళ్ళతో కన్పిస్తోంది.

ఏడాది క్రితంవరకూ ఎంతోయిష్టంగా గొప్పగా వుండే అబద్ధాలు యిప్పుడు యిబ్బందిగా వుంటున్నాయి. సినిమా జీవితంలో డబ్బు, పేరు, గ్లామరు వాటి తాలూకు గొప్ప లోకాన్ని నిత్యం కలలు కంటూ ఆశపడుతూ సిటీకి వచ్చింది. వచ్చిన ఏడాదికి మొదటి సారిగా తన పల్లెటూరికి వెళ్ళడం యిప్పటికీ గుర్తుంది సునందకి. నిజానికి ఆ వూర్లో పనేం లేదు. తల్లీ తండ్రీ లేని తనని పెంచిన మేనమామ కుటుంబం వుందని తప్ప ఆ వూరు తిరిగి వెళ్ళాల్సిన అవసరమూ లేదు. అయినా కావాలని పనిగట్టుకుని వెళ్ళింది. గొప్పగా కనబడాలని కార్లో వెళ్ళింది. రక రకాల పట్టు చీరలు, నాలుగు జతల కాలిజోళ్ళు, కళ్ళజోళ్ళు వేనిటీ బేగ్‌లు అందరి ముందూ ప్రదర్శించి తన గొప్పకి అదృష్టానికి ఆ వూరివారందరూ ఆశ్చర్యపోతుంటే మరింత గొప్పగా ఫోజు కొట్టి ఆనందపడింది.

"మా ఖర్మకి దరిద్రంలా దాపురించావు. నిన్ను కనిపారేసి సుఖంగా చచ్చారు. నీ అమ్మా బాబూ చాకిరీ చేయలేక నేనూ సంపాదించి పొయ్యలేక ఆయనా చస్తున్నాం '

అని అస్తమానం విసుక్కునే మేనత్త కూడా సినిమా కబుర్లు, ఆ అందమైన అబద్ధాలు ఆసక్తిగా వింటూంటే బలే గొప్పగా, తృప్తిగా అనిపించింది సునందకి.

జ్ఞానం తెలిసిం దగ్గర్నుంచి విసుక్కుని, చీదరించుకుని తప్పనిసరి దరిద్రంలా చూసిన మేనత్త కూడా తనని గొప్పగా చూస్తోంది యింకేం కావాలి అన్పించింది.

అంతే! ఆ వేడిలో జీవితం కొత్తవిలువలో కన్పించింది. ఎలాగయినా పైకి రావాలి. డబ్బు సంపాదించాలి. పేరు సంపాదించాలి. చిన్న

తనంలోనే తల్లీ, తండ్రీ కరువయిన నన్ను దరిద్రంగా అనామికంగా చూసిన వీళ్ళందరి కళ్ళు చెదిరేలా మతిపోయేలా సినీమాలోకాన్ని ఏలాలి, అదే ఆలోచన. అదే ఆరాటం. తనని నిర్లక్ష్యంచేసి నిరాదరించిన లోకంమీద మనుషుల మీద కసి! దానిముందు యిష్టం అయిష్టం శరీరం వీటిని వేటినీ లెక్కచెయ్యాలనిపించ లేదు. సుడిగుండంలో చిక్కిన మనిషి తన ప్రమేయం ఏం లేనట్టే సినిమా జీవితం దేన్నీ లెక్కచెయ్యనివ్వలేదు సునందని.

ఊరు వెళ్ళొచ్చాక నాలుగేళ్ళ జీవితం గడిచినా తిరిగి తన వూరు వెళ్ళలేదు. సునందకి ఓరకంగా వెళ్ళాలనిపించలేదు. ఆనాడు ఎరువుగా ఊరికి తీసుకెళ్ళిన కారులాంటి కారు కొనుక్కున్నాక కనీసం ఒక సినిమాలోనేనా హీరోయిన్‌గా కనిపించాక తిరిగి వూరెళ్ళాలి అనుకుంది. ఈనాటికీ కోరికలు తీరలేదు. అప్పుడప్పుడూ దొరుకుతున్న చిన్న చిన్న వేషాలు ఎప్పటికేనా పైకి రాలేకపోతానా అన్న ఆశ యిదే యిప్పుడు సునందకి మిగిలినవి.

వర్షం తగ్గినట్టనిపిస్తే లేచి కిటికీ దగ్గర నిలబడి వెనక్కి తిరిగింది సునంద. ఆ వాతావరణం అంతా తనలాగే నిర్లిప్తంగా కనబడింది సునందకి.

మంచం మీద వొళ్ళెరక్కుండా నిద్రపోతున్న మూడేళ్ళ కూతురు రాధికని చూస్తూ వుంటే దగ్గరికెళ్ళి ముద్దు పెట్టుకోవాలనిపించింది. అడుగు ముందుకు వెయ్యబోతుంటే గుమ్మం ముందు కారాగిన చప్పుడయింది.

వీధి తలుపు తీసి చూసింది. తన కోసమే. రంగా కారు దిగుతున్నాడు.

"రడీయేనా వెళ్దామా" అన్నాడు గదిలో కొచ్చిన సునందవేపు చూస్తూ.

"రడీ" అన్నట్టు తలూపి ప్రక్కపోర్షన్ వాళ్ళ పనిమనిషి కోసం వెళ్ళింది సునంద. రాత్రుళ్ళు బైటికి వెళ్ళాల్సివస్తే వాళ్ళ పనిమనిషిని పిలిచి యింటిని, రాధికని అప్పజెప్పి బయలుదేరాలి.

పనిమనిషికి యిల్లు అప్పజెప్పి మరో అయిదు నిముషాలకి కారెక్కింది.

కొంతదూరం వెళ్ళాక . "కొత్త ప్రొడ్యూసర్ - అందులో కుర్రాడు, కొంచెం గట్టిగా యింప్రెస్ చేయగలిగితే మంచి ఛాన్సు దొరికే అవకాశం వుంది" అన్నాడు రంగా.

ఏం మాట్లాడకుండా తలూపింది సునంద. అలాంటి మాటలు కొత్తకాకపోయినా సునంద మనసులో ఎక్కడో చిన్నగా ఆశ వొళ్ళు విరుచుకుంది.

"నువ్విలా నీరసపడితే ఎలా. ఈ ఫీల్డులో ఎప్పుడే ఛాన్సు వస్తుందో చెప్పలేం. మనసులో ఏం వున్నా పైకి గలగల్లాడుతూ హుషారుగా వుండాలి" అన్నాడు రంగా తిరిగి.

ఆ మాటల్లోని ప్రోత్సాహం సునంద గ్రహించలేనిదేం కాదు. జూనియర్ ఆర్టిస్టు సప్లయిర్‌గా తనకున్న పరిచయాన్ని పలుకుబడిని ఉపయోగించి చాలాసార్లు సాయం చేశాడు సునందకి రంగా.

సరైన విలువలు, సరైన పద్ధతి లేని రంగంలో ఛాన్సు కోసం ఎప్పటి కప్పుడు ఎదురు చూట్టమే దారి అన్నది ఎప్పుడో అర్థమైంది సునందకి.

కొత్త ప్రొడ్యూసర్ రావు వున్న హోటల్ చేరటానికి ఎంతోసేపు పట్టలేదు. అలాగే అతనితో తిరిగి అదే కార్లో వెనక్కి రావడానికి ఎంతోసేపు పట్టలేదు.

"సారీ, హోటల్‌లోనే వుండేవాళ్ళం. అనుకోకుండా ఎవరెవరో వచ్చారు. ఫ్రీగా మాట్లాడుకోవటానికి వుండదు. వాళ్ళు తెల్లారేదాకా వదిలే ఘటాలు కాదు. అందుకే మీ యింటికి రావాల్సి వచ్చింది" అన్నాడు రావు.

"ఫర్వాలేదండీ, దీనికి సారీ ఎందుకు. అసలు నేనే మిమ్మల్ని యింటికి పిలుచుకు వెళ్దామనుకున్నాను" అంది సునంద నవ్వుతూ.

అబద్ధపు మాటలు అబద్ధపు నవ్వులు. కారు యిల్లు చేరేలోపు అలాంటి నవ్వులు చాలా నవ్వింది. అలాంటి మాటలు చాలా చెప్పింది సునంద.

"అభిమానం, ట్రీట్‌మెంట్ ముఖ్యమండీ. అవి లేకపోతే పని చేయలేం. అందుకే ఆ

రెండు ప్రొడక్షన్స్ హీరోయిన్‌గా బుక్ చేస్తామన్నా ఒప్పుకోలేదు" అంది.

ఏ ఏ డైరెక్టర్ తనని ఎంతగా లైక్ చేస్తారో చెప్పింది. ఇల్లు చేరేవరకూ చెబుతూనే వుంది. అవకాశం వుంటే అలా తెల్లవార్లూ చెప్పే నేర్పు ఎప్పుడో అబ్బింది సునందకి.

సునంద, రావు గదిలోకి వచ్చాక సునందకి చెప్పి పనిమనిషి వెళ్ళిపోయింది. రావు వేపు చూస్తూ నవ్వుతూ కనురెప్పలు టపటపలాడిస్తూ మాట్లాడుతూన్న సునందకి తను మాట్లాడుతున్నట్టనిపించలేదు. ఏదో రికార్డు పెట్టి దానికి అలవాటుగా తను నటిస్తున్నట్టే వుంది.

కాసేపు చుట్టూ చూశాడు రావు. తర్వాత సునందవేపు చూశాడు. సునందతో కలిసి తనూ నవ్వాడు. "ఇంత అందమైన నీకు మంచి భవి



ష్యత్తుంది" అన్నాడు. అని దగ్గరికి చేరి సునందను దగ్గిరికి తీసుకున్నాడు.

సునంద బెట్టు చెయ్యడం, వొద్దనడం, ఒప్పుకోవటం యివన్నీ జరుగుతుండగానే అదే మంచంమీద కొంచెం అడ్డుగా కనిపించింది నిద్రపోతున్న రాధిక రావుకు.

"ఈ పిల్లెవరూ " అన్నాడు అసహనంగా.

ఒళ్ళంతా ఒక్కసారి చల్లబడినట్టయింది సునందకి. మిగిలిన అబద్ధం బతుకులాగే అదీ అలవాటున్న అబద్ధమే అయినా గొంతు కొంచెం ఒణికింది.

"అక్కయ్య కూతురు . ఈ మధ్యే అక్కయ్య చచ్చిపోయింది. అందుకే తీసుకొచ్చి పెంచుతున్నాను " అంది. మరి ఆ రంగంలో గ్లామరు కోసం రేపెప్పుడో కలిసొస్తుందని ఆశించే భవిష్యత్తు కోసం తప్పని అబద్ధం.

'ఒహో అలాగా' అన్నట్టు తలూపాడు రావు. మళ్ళీ తిరిగి రావు రాధిక సంగతి అడక్కపోయినా మనసు - తన లోలోపలి తల్లి మనసు మరోసారి చచ్చిపోయినట్టు అనిపించింది సునందకి.

"ఏమిటో ఆలోచన" అన్నాడు రావు సునందవేపు చూస్తూ.

"అబ్బే ఏం లేదు" అంది సునంద తేరుకుని నవ్వుతూ.

"మన సినిమా సంగతేనా! నీ సంగతి రేపే డైరెక్టరుతో మాట్లాడతా సరేనా!" అన్నాడు.

'సరే' అన్నట్టు తలూపింది. తన ఆశలకి కోరికలకి పునాది ఏమిటో అవి తీరకపోవటానికి కారణాలేమిటో తెలియవు సునందకి. ఆ సమయంలో తెలుస్తున్నదొకటే. రావుని యింప్రెస్ చేయాలి. చేసి ఏదో సాధించాలి.

కొన్ని క్షణాల క్రితం చచ్చిపోయిన మనసుకి తిరిగి ఆశతో వూపిరి పోసే ప్రయత్నం చేస్తూ మరింతగా చీకటి వేపు, రావు వేపు జరిగింది సునంద. □

# గతం-గీతం

ప్రశాంతమైన నిశాంతంలో ప్రాభాత శిశూదయం
ఎంత అందమైన దృశ్యం?!!
రాత్రి విరిగిన కలలపైనుండి, కరిగిన కామనలపైనుండి
నడిచి వస్తుం దీ ఉదయం;
అరుణ రక్త కాసారాలనుండి వెలుగుల ప్రాసాదంలోకి
వెయ్యికాళ్ళతో ప్రవేశిస్తుంది నా హృదయం;
నిన్న సాయంత్రం తెగిన కిరణాలు ఇవాళ మళ్ళీ
అతుక్కుంటాయి
రాత్రి త్రాణతో నిట్టూర్చిన జలజాలు నూరు రేకులుగా
వికసిస్తాయి:
సంధ్యకూ ఉషస్సుకూ మధ్య చీకటి కందకం
కందకంలో మొసళ్ళవలె రాత్రిలో పీడకలలు
చీకటిలో తడుములాడినంతసేపు ఏవో సందేహాలు
రాత్రి అంతగా భయపెట్టిన పీడకలలు ఇప్పు డేవీ?
రాత్రి నా ఆలోచనలవలె ఆకాశంలో ముసురుకున్న
నక్షత్రాలేవి?